క్లుప్తంగా

విద్యతోపాటు క్రీడలూ తప్పనిసరి

కడప ఎడ్యుకేషన్ : నేటి పోటీ ప్రపంచంలో చదువుతోపాటు క్రీడలు కూడా తప్పనిసరి అని శారీరక దృఢత్వంతోనే మానసిక స్థిరత్వం ఏర్పడుతుందని ఏపీ స్పోర్ట్స్ అథారిటీ డైరెక్టర్ డేనియల్ ప్రదీప్ పేర్కొన్నారు. గురువారం కడప రామరాజుపల్లె నాగార్జున మోడల్ స్కూల్ బ్రాంచ్‌లో ఉత్సాహంగా స్పోర్ట్స్ డే వేడుకలు జరిగాయి. విద్యాసంస్థల డైరెక్టర్ శ్రీదేవి, నాగార్జున విద్యాసంస్థల చైర్మెన్ శివశంకర్‌రెడ్డి, డైరెక్టర్ శ్రీదేవి, ప్రిన్సిపాల్ వీరశివ, కుళ్లాయప్ప తదితరులు పాల్గొన్నారు.

నేడు సేవా కార్యక్రమాల నిర్వహణ

కడప కోటిరెడ్డిసర్కిల్ : జన వికాస్ సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం పలు సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని ఆ సంస్థ రాష్ట్ర కన్వీనర్ మన్సూర్ అలీఖాన్, రాష్ట్ర సలహాదారులు నూనె నగేష్, పీవీ రమణ, డాక్టర్ శ్రీనివాసులు, కార్యదర్శి యూనుస్‌బాషా తెలిపారు. గురువారం స్థానిక సమితి కార్యాలయంలో వారు మాట్లాడారు. సంస్థ అధ్యక్షులు తాహీర్ జన్మదినాన్ని పురస్కరించుకుని రక్తదాన శిబిరాలు, వృద్ధాశ్రమాలు, అనాథపిల్లల వసతి గృహాల్లో, నిరాశ్రయులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు.

ఆర్‌టీయూ నూతన జిల్లా కమిటీ ఎన్నిక

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : రాయలసీమ ట్రేడ్ యూనియన్ నూతన జిల్లా కమిటీని ఎన్నుకున్నట్లు ఆర్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ఎన్. రవిశంకర్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం నగరంలోని ఆర్‌సీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇటీవల కడప నగరంలో ఆర్‌టీయూ జిల్లా మహాసభలను నిర్వహించామన్నారు. ఈ సభల్లో ఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడిగా శేఖర్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా సిద్దరామయ్య, జిల్లా ఉపాధ్యక్షులుగా గంగన్న, ప్రసాద్‌తో పలువురిని ఎన్నుకున్నట్లు తెలిపారు. ఆర్‌సీపీ నాయకులు లింగమూర్తి, మగ్బూల్ బాషా తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల ఇంటి స్థలాలను సంరక్షించాలి

కడప రూరల్ : ప్రభుత్వం దివ్యాంగులకు కేటాయించిన ఇంటి స్థలాలను సంరక్షించాలని డిజైబుల్ ఫెడరేషన్ జిల్లా ఇన్‌చార్జి వెంకటరామరాజు తెలిపారు. గురువారం స్థానిక వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం 2010లో అర్హులైన దివ్యాంగులకు చింతకొమ్మదిన్నె మండలం చెర్లోపల్లెలో ఒకరికి 1.75 సెంట్లు చొప్పున మొత్తం 275 మందికి ఇంటి స్థలాలను కేటయించిందన్నారు. ఈ స్థలాలు కబ్జాకు గురవుతున్నాయని తెలిపారు. అలాగే కొంతమంది ఈ స్థలాలపై నకిలీ పత్రాలను సృష్టించి ఇతరులకు విక్రయించే ప్రయత్నాలు సాగిస్తున్నారని ఆరోపించారు. ఈ విషయంపై స్థానిక తహసీల్దార్, అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలన్నారు. మాతయ్య, చినబాబు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఏఎస్‌ఐ నిజాయితీ



బాధితుడికి నగదును అప్పగిస్తున్న కడప ఒన్‌టౌన్ ఎస్‌ఐ పెద్ద ఓబన్న

కడప అర్బన్ : రిటైర్డ్ ఏఎస్‌ఐ శ్రీనివాసులు ఔదార్యం చూపించాడు. వివరాల్లోకి వెళితే.. కలెక్టరేట్‌లో ఉద్యోగి అయిన రామిరెడ్డి గురువారం కడప హెడ్ పోస్టాఫీసుకి వెళ్లాడు. ఆ సమయంలో రూ. 20 వేలు నగదును ఆవరణంలో పోగొట్టుకున్నాడు. ఈ క్రమంలో పోస్టాఫీసు ఆవరణలో డబ్బును గమనించిన రిటైర్డ్ ఏఎస్‌ఐ శ్రీనివాసులు కడప ఒన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో నగదును అప్పగించారు. కడప ఒన్‌టౌన్ సీఐ ఎన్.వి నాగరాజు ఆదేశాల మేరకు ఆ డబ్బులను ఒన్‌టౌన్ ఎస్‌ఐ పెద్ద ఓబన్న బాధితుడికి అందజేశారు. ఏఎస్‌ఐ శ్రీనివాస్‌ను సీఐతో పాటు, ఎస్‌ఐలు అభినందించారు.

పగిలిన పైపులైన్‌కు మరమ్మతులు



పగిలిన పైపులైన్‌కు మరమ్మతులు చేసిన దృశ్యం

కడప కార్పొరేషన్ : కడప నగరంలోని రామాంజనేయపురంలో శ్రీసాయి శ్రీనివాస గార్డెన్ ఎదురుగా ప్రధాన పైపులైన్ పగిలిపోయి నీరు వృథాగా ప్రవహిస్తుండేది. దీనివల్ల సీసీ రోడ్డు కూడా పాడైంది. ఈ విషయాన్ని ఈనెల 14న 'సాక్షి' 'పగిలిన పైపులైన్' శీర్షికన వార్త ప్రచురించింది. దీనిపై స్పందించిన నగరపాలక అధికారులు పైపులైన్‌కు మరమ్మతులు చేయించారు. పైపులైన్‌కు మరమ్మతులు చేయించడంపై స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

రోడ్డు విస్తరణకు తొలగిన అడ్డంకులు

టీడీఆర్ బాండు ఇచ్చి ఒప్పించిన టౌన్‌ప్లానింగ్ అధికారులు



ప్రహరీని తొలగిస్తున్న టౌన్‌ప్లానింగ్ అధికారులు

కడప కార్పొరేషన్ : కడప నగరం ఎస్పీ బంగళా–మద్రాసు రోడ్డు మార్గంలో రాజారెడ్డి వీధిలో రోడ్డు విస్తరణకు ఉన్న ఏకైక అడ్డంకి తొలగిపోయింది. ఈ రోడ్డును ప్రభుత్వం 60 అడుగులుగా విస్తరించినా కొందరు న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో అక్కడక్కడా విస్తరణ పెండింగ్‌లో ఉంది. ఇటీవల అందరు భవన యజమానులను ఒప్పించిన టౌన్‌ప్లానింగ్ యంత్రాంగం విస్తరణకు మార్గం సుగమం చేశారు. కానీ నారాయణ స్కూల్ ఎదురుగా ఉన్న ఒక ఇల్లు మాత్రమే మిగిలిపోయింది. ఈ భవన యజమాని సీపీ శ్రీరామ ప్రసాద్ అనే వ్యక్తి న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో ఇక్కడ కొన్నేళ్లు రోడ్డు విస్తరణకు ముందడుగు పడలేదు. దీంతో ప్రతిరోజూ ప్రజలు ట్రాఫిక్ ఇబ్బందులు ఎదుర్కొనేవారు. ప్రస్తుతం సిటీప్లానర్ సంజీవ్‌కుమార్, ఏసీపీ నాగేంద్రలు సదరు భవన యజమానికి ట్రాన్స్‌ఫరబుల్ డెవెలప్‌మెంట్ రైట్స్(టీడీఆర్) గూర్చి వివరించి...విస్తరణకు ఒప్పించారు. ఈ మేరకు శ్రీరామప్రసాద్ తన 66.890 చ.మీ స్థలాన్ని రోడ్డు విస్తరణకు ఇవ్వడానికి అంగీకరించి 267.560 చ.మీల బిల్టప్ ఏరియాకు బాండు తీసుకున్నారు. దీంతో గురువారం టౌన్‌ప్లానింగ్ అధికారులు ఆ ఇంటి ప్రహరీ గోడను కూల్చివేశారు. ఇక్కడ రోడ్డు విస్తరణకు ఉన్న అడ్డంకి తొలగిపోవడంతో నగరవాసుల ట్రాఫిక్ ఇబ్బందులు త్వరలోనే తీరనున్నాయని నగరపాలక వర్గాలు పేర్కొంటున్నాయి.

బాల్య వివాహాలపై అవగాహన అవసరం



సమావేశంలో మాట్లాడుతున్న వన్‌స్టాప్ సెంటర్ కౌన్సిలర్ పీవీ సునీత

కడప కోటిరెడ్డిసర్కిల్ : తల్లిదండ్రులు బాల్య వివాహాలు జరుపుతుంటే విద్యార్థులు తమ దృష్టికి తీసుకురావాలని వన్‌స్టాప్ సెంటర్ కౌన్సిలర్ పీవీ సునీత తెలిపారు. గురువారం జిల్లా స్త్రీ శిశు సంక్షేమ సాధికారిత అధికారి ఆదేశాల మేరకు నగరంలోని కేజీబీవీలో విద్యార్థులకు నిర్భయ, దిశ చట్టాలు, సఖి సెంటర్, సుకన్య సమృద్ధి యోజన తదితర పథకాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె వన్‌స్టాప్ సెంటర్ సేవల గురించి వివరించారు. న్యాయవాది ఉమాదేవి మాట్లాడుతూ బాలికలు ఆపద సమయంలో మహిళా హెల్ప్‌లైన్ నెంబరు 181, పోలీసు హెల్ప్‌లైన్ 100, చైల్డ్ హెల్ప్‌లైన్ 112 నెంబర్లకు కాల్ చేసి సహాయం పొందవచ్చన్నారు. ప్రిన్సిపాల్ పద్మజ, సిబ్బంది పాల్గొన్నారు.

ఈవ్‌టీజింగ్‌కు పాల్పడితే కఠినచర్యలు

దిశ సబ్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మిదేవి



మాట్లాడుతున్న ఎస్‌ఐ లక్ష్మిదేవి

వైవీయూ : ఈవ్‌టీజింగ్‌కు పాల్పడే వారిపై కఠినచర్యలు తప్పవని దిశ పోలీస్ స్టేషన్ ఎస్‌ఐ లక్ష్మిదేవి పేర్కొన్నారు. గురువారం కడప నగరంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో 'సైబర్ నేరాలు, ఈవ్‌టీజింగ్'పై స్టెప్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ సైబర్ నేరాలు పెరుగుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో సాంకేతికతను సక్రమంగా వినియోగించుకోవాలన్నారు. ఓటీపీల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ శేషగిరిరావు, గంగయ్య, అపర్ణ, పావని, స్టెప్ మేనేజర్ సుబ్బారాయుడు తదితరులు పాల్గొన్నారు.

సుస్థిర అభివృద్ధిలో యువత పాత్ర కీలకం



మాట్లాడుతున్న రీసోర్స్ పర్సన్ ఇషానిసేన్

వైవీయూ : సుస్థిర అభివృద్ధి సాధించడం ద్వారానే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని, ఇందులో యువత పాత్ర ఎంతో కీలకమని ఢిల్లీకి చెందిన 'ప్రవా' స్వచ్ఛంద సంస్థ రీసోర్స్ పర్సన్ ఇషానిసేన్ పేర్కొన్నారు. వైవీయూ జాతీయ సేవాపథకం ఆధ్వర్యంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లకు నిర్వహిస్తున్న శిక్షణ తరగతుల్లో రెండోరోజు గురువారం ఇషానీ సేన్ దేశప్రగతిలో ఎన్‌ఎస్‌ఎస్ పాత్ర గురించి వివరించారు. శిక్షణలో భాగంగా పలు కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ సమన్వయకర్త డాక్టర్ వెంకటరామిరెడ్డి, ఎన్‌ఎస్‌ఎస్ పీఓలు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఏసుప్రభువుపై విశ్వాసం కలిగి ఉండాలి



ఆధ్యాత్మిక సందేశం ఇస్తున్న డాక్టర్ సుధీర్

కడప కల్చరల్ : జీవన ప్రమాణంలో కష్టాల్లో ఉన్న వారికి ఏసుప్రభువుపై విశ్వాసం ఉంచితే ఆయన తప్పక సహాయ పడతారని రెడీమర్ చర్చి పాస్టర్ డాక్టర్ బి.సుధీర్ తెలిపారు. గురువారం నగర శివార్లలోని దండు ప్రాంతంలో యేసయ్య ఆశీర్వాద ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సుధీర్ ఆధ్యాత్మిక సందేశమిచ్చారు. ఈ సందర్భంగా రెజీనాతోపాటు పలువురు విశ్వాసులు స్తుతి గీతాలను ఆలపించారు. ఈ కార్యక్రమంలో క్రైస్తవ ప్రముఖులు ఇల్లూరు సురేష్, గుండాల ప్రసాద్, జయన్న, వినోద్, దావీదుతోపాటు ఇతర భక్తులు పాల్గొన్నారు.

గాంధీనగర్ హైస్కూల్లో న్యాయ విజ్ఞాన సదస్సు



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ సెక్రటరీ, సివిల్ జడ్జి ఎస్. కవిత

కడప ఎడ్యుకేషన్ : కడప గాంధీనగర్ హైస్కూల్లో ఉన్న లీగల్ లిటరరీ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ సెక్రటరీ, సివిల్ జడ్జి ఎస్. కవిత న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జాతీయ న్యాయ సేవాధికార సంస్థ వారి బాలల సంరక్షణ కొరకు స్నేహపూర్వక న్యాయ సేవల పథకం 2015ను వివరించారు. ఉచిత న్యాయ సహాయం గురించి వివరించారు. హైస్కూల్ హెచ్‌ఎం సత్యసుజాతమ్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్ట్స్ కళాశాల అధ్యాపకుల ప్రచారం

వైవీయూ : కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాలలో లభించే కోర్సులు, సదుపాయాల గురించి వివరిస్తూ కళాశాల అధ్యాపకులు ప్రచారం నిర్వహించారు. ఏపీ కళాశాల విద్య కమిషనర్ ఆదేశాల మేరకు ఆర్ట్స్ కళాశాల అధ్యాపకులు ఖాజీపేటలోని ప్రభుత్వ మోడల్‌స్కూల్, కేజీబీవీ కళాశాలల్లో విద్యార్థులకు అవగాహన కల్పించారు. కళాశాల ఎన్‌సీసీ అధికారి డాక్టర్ ఆర్. నీలయ్య, డా. అయ్యవారురెడ్డి, డా. మహేష డా. నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

వెన్నపూస రవీంద్రారెడ్డిని గెలిపించండి

కమలాపురం : త్వరలో జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో వైఎస్సార్ సీపీ బలపరచిన అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డికి ప్రథమ ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. గురువారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మండల నాయకులతో కలసి కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి నెలలో జరగబోయే పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బలపరచిన అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డికి ప్రథమ ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గత సాధారణ ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో 98 శాతంకు పైగా హామీలు నెరవేర్చిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఉత్తమారెడ్డి, రాజుపాళెం సుబ్బారెడ్డి, సుమిత్రా రాజశేఖర్ రెడ్డి, ఆర్‌వీఎస్‌ఆర్, గఫార్, హిదాయత్, ఖాజాహుసేన్, మోనార్క్, నిఖిల్‌రెడ్డి, రమణ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న హయాంలోనే నగరాభివృద్ధి



వైఎస్‌ఆర్‌సీపీ నాయకులను అరెస్ట్ చేసి సీకేదిన్నె పోలీస్‌స్టేషన్‌లో ఉంచిన పోలీసులు

చింతకొమ్మదిన్నె : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలోనే నగరాభివృద్ధి జరిగిందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ చైర్మన్ పులి సునీల్‌కుమార్ తెలిపారు.

గురువారం కడప నగరంలోని ఏడురోడ్ల కూడలిలో జిల్లా అభివృద్ధిపై టీడీపీ, వైఎస్‌ఆర్‌సీపీ నాయకులు బహిరంగ చర్చకు సిద్ధమయ్యారు. ఇందులో భాగంగా ఏడు రోడ్ల కూడలిని వేదికగా చేసుకోవడంతో బహిరంగ చర్చకు ఎలాంటి అనుమతి లేకపోవడంతో కడప నగర పోలీసులు ఇరుపార్టీల నాయకులను అరెస్ట్ చేశారు. ఇందులో భాగంగా వైఎస్‌ఆర్‌సీపీ నాయకులను సీకేదిన్నె పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

రేపు బండలాగుడు పోటీలు

చింతకొమ్మదిన్నె : మండలంలోని బుగ్గమల్లేశ్వర ఆలయంలో శనివారం మహా శివరాత్రి సందర్భంగా బండలాగుడు పోటీలను నిర్వహిస్తున్నట్లు బుగ్గలపల్లి సర్పంచ్ గూడ ప్రభాకర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం శివుడికి ప్రత్యేక పూజలు, మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం, అనంతరం బండలాగుడు పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో గెలుపొందిన ఎడ్లకు మొదటి బహుమతిగా రూ.40 వేలు, రెండవ బహుమతి రూ.30 వేలు, మూడవ బహుమతి రూ.20 వేలు, నాల్గవ బహుమతి రూ.15 వేలు, ఐదవ బహుమతి రూ.10 వేలు ఇస్తున్నట్లు తెలిపారు.

రేపు షబ్ ఏ మేరాజ్

- పవిత్ర రాత్రి నిర్వహణకు ప్రత్యేక ఏర్పాట్లు
- మసీదుల్లో ఆధ్యాత్మిక కార్యక్రమాలు

కడప కల్చరల్ : ముస్లిం సమాజం పర్వదినాలలో ఒకటిగా భావించే షబ్–యే–మెహరాజ్ (బడీరాత్) శనివారం నిర్వహించనున్నారు. దాసుడు దైవాన్ని దర్శించుకున్న శుభసందర్భంగా భావిస్తూ ఈరోజున ముస్లింలు పూర్తి భక్తిశ్రద్ధలతో దైవాన్ని, మహా ప్రవక్తను ప్రార్థిస్తారు.

విశ్వప్రవక్త మహమ్మద్ (సా.అ.వ) గగనతల యాత్ర చేసిన రాత్రిని షబ్ ఏ మేరాజ్‌గా భావిస్తారు. పవిత్ర దివ్యగ్రంథం ఖురాన్, హదీస్ గ్రంథాల ద్వారా మహా ప్రవక్త మహమ్మద్ తన సతీమణి ఖతీజ పరమపదించిన తర్వాత ఆమె జ్ఞాపకాలతో వేదన చెందుతున్న సమయంలో అల్లాహ్ తన దూత జిబ్రాయిల్ ద్వారా ప్రవక్తను గగనతల యాత్ర చేయాలని ఆహ్వానిస్తారని తెలుస్తోంది. ఈ ఆహ్వానాన్ని శిరసావహిస్తూ అదేరోజు రాత్రి ప్రవక్త స్వర్గలోకానికి చెందిన బురాఖ్ (గుర్రం లాంటి జంతువు)పై గగనయాత్ర చేసి అర్షే ఆజంలో దైవాన్ని దర్శించుకున్నారని పవిత్ర గ్రంథాల ద్వారా తెలుస్తోంది. ఈ యాత్ర రజబ్ నెల 27వ తేది రాత్రి జరిగినట్లు ఇస్లాం పండితులు వివరిస్తున్నారు. ఆంగ్ల క్యాలెండర్ మేరకు షబ్బే మెహరాజ్ ఈ ఏడాది ఫిబ్రవరి 18న ఉంటుందని తెలుస్తోంది. దాసుడు దైవాన్ని దర్శించుకున్న ఈ పవిత్ర రాత్రిని ముస్లింలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తారు. శుభ్రమైన దుస్తులు ధరించి స్థానిక మసీదుల్లో రాత్రంతా ప్రార్థనలు చేస్తూ గడుపుతారు. ఈ క్రమంలో ప్రార్థనలకోసం అన్ని మసీదుల్లో నిర్వాహకులు, మసీదు కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

ముఖ ఆధారిత హాజరు నుంచి మినహాయింపు ఇవ్వాలి



పాత మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న సీఐటీయూ నాయకులు

కడప కార్పొరేషన్ : ముఖ ఆధారిత హాజరు నుంచి మున్సిపల్ కార్మికులకు మినహాయింపు ఇవ్వాలని సీఐటీయూ నాయకుడు కె.తిరుపాల్, ఎస్.రవి కోరారు. గురువారం స్థానిక పాత మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులపై నగరపాలక యంత్రాంగం తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. 4పూటల మస్టర్ విధానం వల్ల మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఇప్పుడు కొత్తగా ఫేస్ మస్టర్ విధానం అమలుకు అధికారులు సర్క్యులర్ విడుదల చేయడం దారుణమన్నారు. సచివాలయ సెక్రటరీలు కమిషనర్ పేరు చెప్పి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని, వారి పద్ధతి మార్చుకోవాలని కోరారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ నాయకులు ఎస్. కిరణ్, వడ్లపల్లి బాబు, గోపి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ ప్రభుత్వ అధ్యాపకుల సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఇంటర్ ఆర్‌జేడీ రవి, డీవీఈఓ శ్రీనివాసులరెడ్డి, ఆర్‌ఐఓ రమణరాజు

కడప ఎడ్యుకేషన్: వైఎస్సార్‌జిల్లా ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు సంబంధించిన ఎస్సీ, ఎస్టీ ప్రభుత్వ అధ్యాపకుల సంఘం– 2023వ సంవత్సరం క్యాలెండర్‌ను గురువారం ఇంటర్మీడియట్ ఆర్‌జేడీ రవి, డీవీఈఓ శ్రీనివాసులరెడ్డి, ఆర్ఐఓ రమణరాజులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ఏడాది ఇంటర్ ఫలితాల్లో మంచి ఉత్తీర్ణత శాతాన్ని సాధించేందుకు ఇప్పటి నుంచే ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని సూచించారు.

కార్యవర్గ ఎన్నిక .. రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు జిల్లాలో ఖాళీలు ఏర్పడిన కార్యవర్గ పదవులకు ఎన్నికలు నిర్వహించారు. ఇందులో పులివెందుల ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన బాలరాజు జోనల్ సెక్రటరీగా, తొండూరు కళాశాలకు చెందిన రవికుమార్ కోశాధికారిగా, చిన్న ఓరంపాడు కళాశాలకు చెందిన మంజు మహిళా సెక్రటరీగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ అధ్యాపకుల సంఘం జిల్లా అధ్యక్షుడు రాజారావు, సెక్రటరీ వెంకటేశు, ఉపాధ్యక్షుడు సింగరయ్య, జాయింట్‌సెక్రటరీ దుర్గన్న, స్టేట్ కౌన్సిల్ మెంబర్ బూతు లింగేశ్వరావు పాల్గొన్నారు.


సులభతరంగా పాఠ్యాంశాలను బోధించాలి

వీరపునాయునిపల్లె : పాఠశాలల్లో ఉపాధ్యాయులు విద్యార్థులకు సులభతరంగా అర్థమయ్యేలా పాఠ్యాంశాలను బోధించాలని జిల్లా విద్యాశాఖాధికారి దేవరాజు సూచించారు. గురువారం ఆయన మండలంలోని పాయసంపల్లె కందుల మంగమ్మ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేశారు. ముందుగా పాఠశాల ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. అభ్యసన, అభివృద్ధి కార్యక్రమం సమర్థవంతంగా నిర్వహించాలని అలా చేయడం వలన 10వ తరగతి విద్యార్థులు పాఠ్యాంశాలను సులువుగా అర్థం చేసుకోవడంతో పాటు ఉత్తీర్ణత శాతం పెరగడానికి వీలవుతుందన్నారు. అనంతరం పాఠశాలలో జరుగుతున్న నాడు–నేడు పనులను పరిశీలించారు.

ఘనంగా కోట గంగమ్మ వార్షికోత్సవం



పూజలు అందుకుంటున్న కోటగంగమ్మ



ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డిని సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

కమలాపురం : పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో వెలసిన శ్రీ కోటగంగమ్మ ఆలయ వార్షికోత్సవ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు, కమిటీ సభ్యులు, పట్టణ ప్రజల సమక్షంలో కోటగంగమ్మ 16వ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాలాభిషేకం, అభిషేకాలు నిర్వహించి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. పెద్దఎత్తున మహిళలు ఆలయానికి చేరుకుని సామూహిక కుంకుమార్చన చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిర్వాహకులు వారికి తీర్థ ప్రసాదాలతోపాటు గాజులు, పసుపు, కుంకుమలను నిర్వాహకులు అందజేశారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. అలాగే స్థానిక ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేకు శాలువ కప్పి ఘనంగా సత్కరించారు.